

డెల్టాలకు 9,250 క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,250 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 2,750, సెంట్రల్ 1,900, పశ్చిమకు 4,600 క్యూసెక్కులు ఇచ్చారు.



యూడైస్‌తో ఎంతో ప్లస్
పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

- వివరాలు 8లో▸

నిత్యాన్నదానానికి విరాళాలు


సఖినేటిపల్లి: లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తాంజనేయ స్వీట్స్ అధినేత నలాది వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు (తాపేశ్వరం) రూ.50 వేలు, ఎన్‌కేఎస్ ఎస్ శ్రీనివాస్, కుటుంబ సభ్యులు (కాకినాడ) రూ.50 వేల చొప్పున సోమవారం విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో 150 అడుగుల జెండా స్తంభం



కాకినాడ సిటీ: ఈ నెల 26న రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో 150 అడుగుల ఎత్తయిన జెండా స్తంభం ఏర్పాటు చేస్తున్నారు. గణతంత్ర దినోత్సవం నాడు ఈ స్తంభంపైనే జెండా ఎగురవేసేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సంబంధిత పనులు వేగంగా చేస్తున్నారు.

షూటింగ్‌లో అన్నదమ్ములకు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన అన్నదమ్ములు కార్తికేయ, సత్యనారాయణ

కరప: ఆగ్రా ఏకలవ్య స్టేడియంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకూ జరిగిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో కరప మండలం గొర్రిపూడికి చెందిన అన్నదమ్ములు బంగారు పతకాలు సాధించారు. సంసద్ ఖేల్ స్పర్ధ క్రీడ పేరిట కేంద్ర ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహించింది. క్రాస్ బౌ రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఏడు రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ విభాగంలో జాతీయ స్థాయి బాలుర అండర్–14, అండర్–20 కేటగిరీల్లో గొర్రిపూడికి చెందిన అన్నదమ్ములు గండి కార్తికేయ, గండి సత్యనారాయణ పాల్గొన్నారు. అండర్–14లో కార్తికేయ (592/600), అండర్–20లో సత్యనారాయణ(585/600) పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకాలు సాధించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ బఘెల్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. ఈ వివరాలను విజేతల తండ్రి శివకుమార్ సోమవారం తెలిపారు.

నేడు జాతీయ బాలికా దినోత్సవం
కాకినాడ సిటీ: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. ఇందులో కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, వైద్య, ఆరోగ్య సేవల జోన్–2 రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.పద్మా శశిధర్, డీఎంహెచ్‌ఓ ఎం.శాంతిప్రభ పాల్గొంటారు. 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. అలాగే ఉన్నత సేవలందించిన వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను సత్కరిస్తారు.

పోలీసు స్పందనకు 47 ఫిర్యాదులు


ఫిర్యాదీ సమస్య వింటున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 47 ఫిర్యాదులు అందాయని ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో 12 సివిల్ వివాదాలు కాగా, ఏడు కుటుంబ తగాదాలు, 28 ఇతర సమస్యలకు చెందినవి ఉన్నాయని వివరించారు.

ఆశాజనకం

- జిల్లాలో రబీ వరి సాగు లక్ష్యం 1.92 లక్షల ఎకరాలు
- ఇప్పటికే 1.60 లక్షల ఎకరాల్లో నాట్లు
- మూడో పంట వేసుకొనే వెసులుబాటు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): వరుణుడు సహకరించడం.. ఖరీఫ్‌లో అధిక దిగుబడులు రావడం.. రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా మద్దతు ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంతో.. రైతులు అనుకున్న విధంగానే ముందస్తు రబీ సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.92 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకూ 1.60 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. మెట్ట ప్రాంతం మినహా మిగిలిన ప్రాంతాల్లో దాదాపు వరి నాట్లు పూర్తయ్యాయి. మూడో పంట చేపట్టడం ద్వారా రైతులు లాభపడాలనే లక్ష్యంతో గత ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం ముందస్తుగానే సాగునీరు విడుదల చేసింది. రైతులు కూడా సహకరించడంతో అనుకున్న ప్రణాళిక ప్రకారం డిసెంబర్ మొదటి వారంలోనే ఖరీఫ్ సాగు పూర్తయ్యింది. డిసెంబర్ నెలాఖరు నుంచి రబీ సాగు మొదలైంది. ఈ నెలాఖరులోగా వరి నాట్లు పూర్తి కానున్నాయి. దీంతో మూడో పంట కూడా వేసేకొనేలా అన్నదాతలకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీరు ఆలస్యంగా ఇవ్వడంతో మూడో పంట వేసుకొనే వీలుండేది కాదు. దీంతో అపరాల సాగుకు అవకాశం లేక రైతులు ఆదాయం కోల్పోయేవారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం గత ఏడాది జూన్ నెలలోనే ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి నీటిని డెల్టాలకు విడుదల చేసి, ఖరీఫ్ ఆలస్యం కాకుండా చూసింది. ఫలితంగా రబీ వరి నాట్లు ఈ నెలాఖరులోగా పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో మూడో పంటగా అపరాలు సాగు చేసుకొనే వీలుంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్ల అపరాల దిగుబడి వస్తుందని, ఇది రైతులకు ఆర్థికంగా ఎంతో భరోసా ఇస్తుందని చెబుతున్నారు.

పుష్కలంగా ఎరువులు

రబీలో జిల్లా వ్యాప్తంగా అన్ని రకాలూ కలిపి 80 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటి వరకూ 32 మెట్రిక్ టన్నులు ఆయా ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు. అవసరానికి అనుగుణంగా ఎరువులను అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.

వెదజల్లుపై ఆసక్తి

గతంలో ప్రతి గ్రామంలోనూ వరి నాట్లు వేసేందుకు కూలీలు అధికంగా దొరికేవారు. నేడు గ్రామాల్లో ఆ పరిస్థితి లేకపోవడంతో వెదజల్లు సాగుకు రైతులు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలు కొన్ని గ్రామాలకు వచ్చినా.. కూలి రేట్లు ఎక్కువగా ఉండటంతో వెదజల్లు సాగే మేలని భావిస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకూ 1.60 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా ఇందులో 1.10 లక్షల ఎకరాలు వెదజల్లు సాగే కావడం గమనార్హం. మిగిలిన 50 వేల ఎకరాల్లో మాత్రమే కూలీలతో నాట్లు వేయించారు. నారు వేసిన 21 రోజుల తరువాత దానిని తీసి, నాట్లు వేయడం వలన ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ అధికంగా ఖర్చవుతోంది. దీంతో వెదజల్లు సాగుకే రైతులు సై అంటున్నారు.



సామర్లకోట మండలం చంద్రపాలెంలో వెదజల్లు సాగు చేసిన పొలాలు

లక్ష్యం నెరవేరింది


ముందస్తు రబీ సాగు చేసేలా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. మూడో పంట వేసుకొంటే కలిగే లాభాలను వివరించాం. దీంతో ముందస్తు రబీ సాధ్యమైంది. ఇప్పటికే జిల్లాలో రబీ వరి నాట్లు దాదాపు పూర్తయ్యాయి. నెలాఖరులోగా వంద శాతం పూర్తవుతాయి. వరి నాట్లు వేయడం కంటే వెదజల్లు సాగు మంచిదని రైతులకు అవగాహన కల్పించాం. ఇది కూడా అధిక విస్తీర్ణంలో నాట్లు పడటానికి కారణమైంది.

- ఎన్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

నేడు అజయ్ కల్లాం రాక
వైఎస్సార్ జగనన్న భూ హక్కు – భూ రక్షపై ప్రాంతీయ సమావేశం



సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం మంగళవారం రాజమహేంద్రవరం రానున్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఈ విషయం తెలిపారు. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులతో వైఎస్సార్ జగనన్న భూ హక్కు – భూ రక్ష పథకం అమలుపై రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో అజయ్ కల్లాం సమీక్షిస్తారు. భూ హక్కు – భూ రక్ష పథకం స్టీరింగ్, అమలు కమిటీ చైర్మన్ హోదాలో ఆయన ఈ ప్రాంతీయ సమావేశంలో పాల్గొంటారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. అజయ్ కల్లాం పర్యటన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం రాత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు.

సెంటు భూమి కూడా వదలం



గొంది కొత్తపల్లిలో వ్యవసాయ భూమిని పరిశీలిస్తున్న ఈఓ సత్యనారాయణమూర్తి, ఇతర అధికారులు

- ఆక్రమణల బారిన పడనివ్వం
- అన్నవరం దేవస్థానం ఈఓ
- గొంది కొత్తపల్లి, చెందుర్తిల్లో భూముల పరిశీలన

అన్నవరం: సత్యదేవునికి చెందిన ఒక్క సెంటు భూమి కూడా ఆక్రమణలకు గురి కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. దేవస్థానం అధికారులతో కలసి గొంది కొత్తపల్లిలోని 35 ఎకరాల వ్యవసాయ భూమిని, చెందుర్తిలోని వ్యవసాయ భూమిని, రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆ భూముల సరిహద్దులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, రికార్డుల ప్రకారం ఆ భూముల సరిహద్దులు యథాతథంగా ఉన్నాయని తెలిపారు. అయితే సందేహాల నివృత్తికి త్వరలోనే రెవెన్యూ అధికారులతో రీ సర్వే చేయిస్తామని చెప్పారు. సర్వే రాళ్లు పాతించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఏ భూమి ఎక్కడ ఎంత ఉందనే దానిపై సమగ్ర వివరాలు సేకరించి, బుక్‌లెట్ తయారు చేయిస్తామని చెప్పారు.

కళాశాల వెనుక భూమికి రక్షణ

స్థానిక జూనియర్ కళాశాల వెనుక ఉన్న స్థలాన్ని ఇటీవల కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఈ స్థలానికి కూడా పటిష్ట రక్షణ కల్పిస్తున్నామని ఈఓ సత్యనారాయణమూర్తి తెలిపారు. త్వరలోనే ఈ స్థలాన్ని కూడా సర్వే చేయిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు సోమవారం చేసిన పరిశీలనలో ఈ స్థలం దేవస్థానానిదేననే విషయం రుజువైందన్నారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ నూకరత్నం, ఏఈఓ ఎల్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం
- స్పందనలో 257 అర్జీల స్వీకరణ
- ఫిబ్రవరి 6న కోటనందూరులో జిల్లా స్థాయి స్పందన



స్పందన కార్యక్రమంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీతలతో కలిసి ప్రజల నుంచి 257 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వివిధ శాఖలు తమ జిల్లా స్థాయి సమావేశాల్లో స్పందన అర్జీలపై ప్రత్యేకంగా చర్చించి, క్షేత్రస్థాయి అధికారులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. 1902, ముఖ్యమంత్రి కార్యాలయం తదితరాల ద్వారా 'జగనన్నకు చెబుదాం' కింద అందే దరఖాస్తులను 24 గంటలల్లోపు ఓపెన్ చేయాలని చెప్పారు. ఫిబ్రవరి 6న మొదటి సోమవారం కోటనందూరులో జిల్లా స్థాయి స్పందన నిర్వహిస్తామని కృతికా శుక్లా వెల్లడించారు. కాకినాడ ఎంపీ వంగా గీత కొద్దిసేపు స్పందన కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ కృతికా శుక్లా, అర్జీదారులతో మాట్లాడారు. ఆయా సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సమగ్ర భూ సర్వే సమీక్షకు సిద్ధం కావాలి

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి సలహాదారు అజేయ కల్లాం ఆధ్వర్యాన మంగళవారం రాజమహేంద్రవరంలో సమీక్షా సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ పథకం పురోగతిపై కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియలు రెవెన్యూ, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజమహేంద్రవరంలో జరిగే కోస్తాంధ్ర ప్రాంతీయ సమీక్షా సమావేశానికి జిల్లా అధికారులు సిద్ధం కావాలని ఆదేశించారు. ఈ పథకం అమలుపై నివేదికలు రూపొందించాలని అన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, కాకినాడ ఆర్‌డీఓ బీవీ రమణ, రీ సర్వే అధికారులు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

వేద పండితుడు తంగిరాల విశ్వనాథశాస్త్రి కన్నుమూత

రాజమహేంద్రవరం రూరల్: తంగిరాల వారి వంశంలో రెండో తరం ద్వివేదిగా, శ్రీశైలం దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా 40 ఏళ్ల సేవలందించిన వేద పండితుడు తంగిరాల విశ్వనాథశాస్త్రి (100) కొంతమూరులోని ఆయన కుమారుని నివాసంలో కన్ను మూశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రముఖ త్రివేది తంగిరాల బాలగంగాధరశాస్త్రి పెద్ద కుమారుడైన విశ్వనాథశాస్త్రి సోమయాగం, మహాగ్నిచైనం, వ్యూఢ పౌండరీకం, వాజపేయం, బృహస్పతీసవం తదితర ఉత్కృష్ట యాగాలు నిర్వహించారు. పౌండరీక, వాజపేయ, సోమయాజులుగా పేరు పొందారు. ఆయనకు ముగ్గురు కుమారులు. వారందరూ కూడా ద్వివేదులే. ఆయన ఐదుగురు మనవలు కూడా వేద విద్య అభ్యసిస్తున్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సమక్షంలో ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆహితాగ్ని భాస్కర బిరుదును, స్వర్ణ కంకణాన్ని విశ్వనాథశాస్త్రి అందుకున్నారు. వేలాది మంది శిష్యుల్ని తయారు చేసిన ఘనత ఆయనకు ఉంది. శ్రీశైలం దేవస్థాన ఆస్థాన విద్వాంసుడిగా పదవీ విరమణ అనంతరం కపిలేశ్వరపురం వేద పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలు అందిస్తున్నారు. కొద్ది రోజులుగా అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొందుతూ కన్ను మూశారు. విశ్వనాథశాస్త్రి పార్థివ దేహాన్ని జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరుమాళ్ళ రఘునాథ్, వందలాదిగా వేద పండితులు సందర్శించారు.



తంగిరాల విశ్వనాథశాస్త్రి (పాతచిత్రం)

నిత్యాన్నదానానికి రూ.1,11,116 విరాళం
పిఠాపురం: పాదగయ క్షేత్రంలో నిత్యాన్నదానానికి రెడ్డెం రామారావు (పిఠాపురం) సోమవారం రూ.1,11,116 విరాళం సమర్పించారు. దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకరరావుకు అందజేశారు. దాతను అర్చకులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పల్ల విజయకుమార్, బండి శారద, మేడిశెట్టి ఉమామహేశ్వరావు, గ్రంధి గణేష్, బత్తిన వరలక్ష్మి, కూసిరెడ్డి సత్యనారాయణ, దంగేటి ఆదినారాయణ, వడిశెట్టి గాయత్రి, కోట శ్రీరామచంద్రమూర్తి, కార్యనిర్వహణాధికారి సౌజన్య పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటక కళాపరిషత్ పోటీలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గొందేసి రాజా

పెద్దాపురం: స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా నాటక కళా పరిషత్ పోటీలు నిర్వహిస్తున్నామని స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా అన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ రాష్ట్ర స్థాయి నాటక కళా పరిషత్ పోటీలు జరుగుతాయన్నారు. కళలు మానసిక ఉల్లాసానికే కాదని, జన జాగృతి కోసం, చైతన్యం కోసమన్నారు. ఇందులో నాటకం చాలా శక్తివంతమైందన్నారు. నాటకం పల్లె పల్లెకూ చేరువ కావాలని భావిస్తూ కొన్ని నాటకాలను ప్రదర్శిస్తూ మూడేళ్ల కిందట పరిషత్‌ను ఏర్పాటు చేయాలని స్నేహ ఆర్ట్స్ భావించిందన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ఏడు నాటికల ప్రదర్శన ఉంటుందని రాజా తెలిపారు. 24న రాత్రి ఏడు గంటలకు నాటక కళా పరిషత్ పోటీలను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి ప్రారంభిస్తారన్నారు. తొలిరోజు విశాఖ జిల్లా ఉక్కు నగరం వారిచే 'గుడి ఎనక నాసామి', హైదరాబాద్ వారిచే 'దా'రుణం', 25న కాకినాడ వారిచే గమ్యస్థానాల వైపు, గుంటూరు వారిచే రెండు నిశ్శబ్దాల మధ్య, మూడో ప్రదర్శనగా చిలకలూరిపేట వారిచే నాన్నా నేనొచ్చేస్తా, 26న హైదరాబాద్ వారిచే మనిషి మంచోడే, కాకినాడ వారిచే రాయి నాటికతో పాటు మూడో ప్రదర్శనగా స్నేహ ఆర్ట్స్ చంద్రమాంపల్లి వారిచే ఆ రోజు కోసం నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ పోటీలకు కళా ప్రియుడు హాజరై జయప్రదం చేయాలని రాజా కోరారు. సమావేశంలో కొత్తెం స్వామినాథన్, గోగులపాటి సీతారామస్వామి, యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగు, గొందేసి సత్యానందం, వెన్నా పండు, నూకలమంతి నానాజీ, సమ్మెట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు మెల్లగా.. అవస్థలు ఫుల్‌గా..

- రత్నగిరిపై నిలిచిన విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు
- పిల్లర్ల కోసం గోతులు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్
- రహదారిపై నిలిచిపోయిన రాకపోకలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న భక్తులు



షెడ్డు నిర్మాణానికి రోడ్డును తవ్వి, రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 30 వీఐపీ సత్రం వెనుక పార్కింగ్ స్థలంలో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. శరవేగంగా జరగాల్సిన పనులు ఆలస్యం కావడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రత్నగిరికి వచ్చే భక్తులు పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఉన్న 30 వీఐపీ పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు దిగి ఆలయానికి వస్తుంటారు. ఇక్కడ ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడుస్తున్నారు. ఇక్కడ షెల్టర్ నిర్మించాలని భక్తులు దీర్ఘకాలంగా కోరుతున్నారు. దీంతో ఎట్టకేలకు దేవస్థానం దీని నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది.

గత నెల 30న టెండర్ ఆమోదం

రూ.23.73 లక్షలతో జీఐ ప్రొఫైల్ షీట్ ఆధారంగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవగా రూ.18.56 లక్షలకు టెండర్ దాఖలైంది. దీనిని గత నెల 30న దేవస్థానం ధర్మకర్తల మండలి ఆమోదించింది. వెంటనే పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో 30 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవున షెల్టర్ నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

గోతులతో ఇక్కట్లు

షెడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. షెల్టర్ నిర్మాణానికి గత నెల మొదటి వారంలోనే రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వి, ఆ మట్టి, రాళ్లు రోడ్డుపై వేశారు. తరువాత అర్ధాంతరంగా పనులు ఆపేశారు. ఈ రోడ్డు ద్వారానే సగానికి పైగా భక్తులు ఆలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వీరందరూ చుట్టూ తిరిగి ఆలయానికి వెళ్లాల్సి వస్తోంది. ద్విచక్రవాహనదారులు ఈ రోడ్డు మీదుగానే పశ్చిమ రాజగోపురం వరకూ వెళ్లే అవకాశం ఉండేది. ఇప్పుడు అది కూడా లేదు. కనీసం ఆ గోతులు పూడ్చివేసినా భక్తుల రాకపోకలకు వీలుండేది. ఈ రోడ్డు మూసివేయడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు.

పెరిగిన భక్తుల రద్దీ

మాఘ మాసాన్ని పురస్కరించుకుని దేవస్థానానికి భక్తుల రద్దీ పెరిగింది. దీనికి తోడు ఈ నెల 26 నుంచి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. దీంతో దేవస్థానంలో రద్దీ మరింత పెరగనుంది. అప్పటికి కూడా ఈ షెల్టర్ పనులు పూర్తి కాకపోతే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

త్వరలోనే పూర్తి చేయిస్తాం


భక్తులకు సౌకర్యార్థం ఈ షెల్టర్ నిర్మిస్తున్నాం. స్తంభాల నిర్మాణానికి గోతులు తీశారు. దీంతో ఆ రోడ్డు ద్వారా రాకపోకలు నిలిపివేశాం. సంక్రాంతి పండగ కారణంగా పనులు తాత్కాలికంగా ఆపేశారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి త్వరగా షెల్టర్ నిర్మించాలని ఆదేశించాం. అతి త్వరలోనే దీని నిర్మాణం పూర్తి చేయిస్తాం.

- సత్యనారాయణమూర్తి, ఈఓ, అన్నవరం దేవస్థానం

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: మద్యం మత్తులో ఒక వ్యక్తి కలుపు మందు తాగి మృతి చెందాడు. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన చప్పిడి వీరబాబు(42) తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో మకాం ఉంటున్నాడు. ఆదివారం ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి తన ఆర్థిక పరిస్థితి బాగో లేదని, ఆదుకోవాలని వారితో చెప్పుకున్నాడు. అనంతరం అతిగా మద్యం తాగాడు. ఆ మైకంలో అతను కలుపుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతనిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ సభ్యుల అరెస్ట్

ధవళేశ్వరం: స్థానిక కంచర్లలైన్‌లో ఈ నెల 16వ తేదీన అండిబోయిన రాజేష్ అనే యువకుడిని చాకుతో పొడిచి హత్య చేసిన ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ సభ్యులను సోమవారం అరెస్ట్ చేశామని ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి తెలిపారు. ప్రధాన నిందితుడితో పాటు మరో నిందితుడు మైనర్ అని పేర్కొన్నారు. వీరితోపాటు మోరంపూడి రాజ్‌కుమార్ అనే యువకుడిని అరెస్ట్ చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచామని సీఐ మంగాదేవి వెల్లడించారు.

యూడైస్‌తో ఎంతో ప్లస్



- పాఠశాల స్థాయి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్న విద్యాశాఖ
- దీని ఆధారంగానే 2023–24 సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పన
- అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల మంజూరు
- ఈ నెల 26 ఆన్‌లైన్ నమోదుకు తుది గడువు

రాయవరం: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల కేటాయింపు జరుగుతుంటుంది. ప్రణాళిక రూపకల్పనలో భాగంగా యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. వచ్చిన సమాచారం ఆధారంగానే జిల్లా సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పనకు వీలవుతుంది.

సెప్టెంబర్ 30వ తేదీ ప్రాతిపదిక

సమగ్ర జిల్లా విద్యా సమాచార వ్యవస్థను యూడైస్‌గా పేర్కొంటారు. 2022–23 విద్యా సంవత్సరం పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సదుపాయాల వివరాలను యూడైస్ ద్వారా సేకరిస్తారు. కేంద్ర ప్రభుత్వం యూడైస్ ద్వారా పాఠశాలల సమాచార సేకరణను 2000 సంవత్సరం నుంచి ప్రారంభించింది. ఏటా సెప్టెంబర్ 30 తేదీని ప్రాతిపదికగా తీసుకుని యూడైస్ ద్వారా పాఠశాలల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు విద్యాశాఖ, ఏపీ సమగ్ర శిక్షా సంయుక్తంగా కసరత్తు ప్రారంభించాయి. ఈ వివరాల ద్వారానే సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను సాధించడం సాధ్యపడుతుంది. ఎస్‌డీజీ, పీజీఐ, నీతి ఆయోగ్‌కు సంబంధించిన అన్ని విషయాలకు యూడైస్ ప్రాతిపదికగా నిలుస్తోంది. ఈ డేటా ఆధారంగా విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాల నిర్వహణ, 2023–24 విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పన వీలవుతుంది.

ఈ నెల 26 తుది గడువు

గతంలో యూ డైస్ ప్లస్ సమాచార సేకరణ మాన్యువల్‌గా ఉండేది. మూడేళ్లుగా ఆన్‌లైన్‌లోనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. పాఠశాల కేంద్రంగా సమాచారాన్ని హెచ్‌ఎంలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ సమాచారం నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతుంది. ఈ నెల 26వ తేదీలోగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు యూడైస్ రూపకల్పనలో బిజీగా ఉన్నారు. ఈ నెలాఖరులో జిల్లా బడ్జెట్ రూపకల్పనకు తుది రూపు వచ్చే అవకాశం ఉంది.



తుది రూపునకు విద్యా ప్రణాళిక..

సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక అవసరాలకు నిధుల కేటాయిస్తారు. పాఠశాలల నుంచి వచ్చే సమాచారమే నిధుల కేటాయింపునకు ప్రాతిపదికగా నిలుస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 5,261 విద్యా సంస్థల నుంచి సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులను రేషనలైజేషన్ చేయాలన్నా, నూతనంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంటగదులు, లేబొరేటరీ గదులు, ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు.. ఇలా ఏది మంజూరు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ ద్వారా పంపే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ సమాచారం ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ సమగ్ర శిక్షాకు నిధులు కేటాయిస్తాయి. అందుకే యూడైస్ ప్లస్ ద్వారా సేకరించే సమాచారం కీలకంగా మారుతుంది.

సమాచారం కీలకం



విద్యాశాఖకు సంబంధించిన బడ్జెట్ రూపకల్పనకు యూడైస్ ప్లస్ సమాచారం ఎంతో కీలకం. పాఠశాల హెచ్‌ఎంలు క్షేత్ర స్థాయిలో ఉన్న కచ్చితమైన సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ సమాచారం పాఠశాలల అభివృద్ధికి కీలకంగా ఉంటుంది.

– డి.మధుసూదనరావు, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

గడువులోగా పూర్తి చేయాలి



యూడైస్ సమాచార సేకరణను హెచ్‌ఎంల సహకారంతో అనుకున్న సమయానికి పూర్తి చేస్తాం. ఉపాధ్యాయులు ఇచ్చే సమాచారం ఆధారంగానే పాఠశాలలకు నిధుల కేటాయింపు ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది.

– ఎస్.అబ్రహం, డీఈవో, తూర్పుగోదావరి

ఆ వివరాలు తప్పనిసరి



యూ డైస్ ప్లస్ నమోదు సమయంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. పాఠశాల సమగ్ర సమాచారం యూడైస్ ప్లస్‌లో స్పష్టంగా కనిపించాలి. ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా సమాచార సేకరణ చేపట్టాలి.

– ఎన్‌వీ రవిసాగర్, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- బీటెక్ విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన తరుణ్ బాబు



తరుణ్‌బాబు (ఫైల్)

మాకవరపాలెం : బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్ బాబు, సింగిరెడ్డి దినేష్(విజయనగరం), రావాడ లోకేష్ (శ్రీకాకుళం)లు మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ సంఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే హాస్టల్‌కు చేరుకోనున్న తరుణ్‌బాబు మృతి చెందడంతో తోటి విద్యార్థులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సర్వీసు అందించాలి



షోరూమ్ ప్రారంభోత్సవంలో జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, షోరూమ్ చైర్మన్ రమేష్ తదితరులు



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

పృథ్వీ టయోటా షోరూమ్ ప్రారంభోత్సవంలో ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి

కాకినాడ రూరల్: ఖాతాదారులకు మెరుగైన సర్వీసును అందివ్వాలని ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. కాకినాడ – పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పృథ్వీ టయోటా షోరూమ్‌ను సోమవారం వారు ప్రారంభించారు. షోరూమ్ చైర్మన్ మాలెంపాటి రమేష్‌బాబు, డైరెక్టర్ పృథ్వీలకు అభినందనలు తెలియజేశారు. చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ కాకినాడ ప్రాంతంలో టయోటా వాహనాలకు సర్వీసు సదుపాయం కొన్నేళ్లుగా నిలిచిపోయిందని, ఇప్పుడు కొత్తగా పృథ్వీ టయోటా షోరూమ్ ద్వారా ఆ లోటు తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. షోరూమ్ ద్వారా కస్టమర్లకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ప్రారంభం సందర్భంగా 100శాతం ఫైనాన్స్ సౌకర్యంతో వాహనాలను కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో షోరూమ్ ప్రారంభించి ఉభయ గోదావరి జిల్లాల కస్టమర్ల మన్ననలు పొందామన్నారు.

రాయుడుపాలెం వద్ద షోరూమ్ ప్రారంభోత్సవంలో కలెక్టరు కృతికా శుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, పిఠాపురం, పెద్దాపురం ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, నిమ్మకాయల చినరాజప్ప, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, సేల్స్ మేనేజర్ శివ, సర్వీసు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి కారును బి.శ్రీనివాస్, రెండవ కారును టి.వెంకటరత్నం కొనుగోలు చేశారు.

సైకత ప్రశ్న



దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పం

రంగంపేట: తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలో దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకత శిల్పం పలువురిని ఆలోచింపజేస్తోంది. ఈ నెల 24న జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) ఆడపిల్లగా పుట్టడమే పాపమా..? అనే నినాదంతో సోమవారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పాన్ని తీర్చిదిద్దిన దేవిన సిస్టర్స్‌ను పలువురు అభినందిస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుమారుడి ఆచూకీ లభ్యం



సికింద్రాబాద్‌లో చరణ్‌సాయి తేజరెడ్డిలను అదుపులోకి తీసుకున్న పోలీసు

కాకినాడ రూరల్: కాకినాడ ఆశ్రమ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి బైరెడ్డి తేజరెడ్డి ఆచూకీ లభ్యమైంది. పెదపూడి హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బైరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమారుడు తేజరెడ్డి ఈ నెల 21న పాఠశాలకు అని బయలుదేరి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తేజరెడ్డి అదృశ్యం సంఘటన వైరల్ కాగా, సర్పవరం పోలీసుస్టేషన్‌లో తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా తేజరెడ్డి, పదవ తరగతి చదువుతున్న మరో విద్యార్థి చరణ్‌సాయి ఇద్దరూ కలిసి బెంగళూరు వెళ్లేందుకు రైలులో సికింద్రాబాద్ చేరుకున్నారు. అయితే వారి తీసుకెళ్లిన సొమ్ము ఖర్చయిపోవడంతో సోమవారం కాకినాడలోని స్నేహితుడికి ఫోన్ చేసి పంపాలని కోరారు. ఫోన్‌లో మాట్లాడిన విద్యార్థి ఆశ్రమ స్కూల్ ప్రిన్సిపాల్‌కు తెలియజేయడంతో వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సర్పవరం పోలీసులు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించి కాకినాడ నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారని తెలియజేశారు. అక్కడి పోలీసులు తేజరెడ్డి, చరణ్‌సాయిలను తమ అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులను తీసుకువచ్చేందుకు సర్పవరం పోలీసులతోపాటు తండ్రి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. క్షేమంగా విద్యార్థులు ఇద్దరిని ఇంటికి తీసుకువస్తున్నట్టు సర్పవరం స్టేషన్ రైటర్ నాగేశ్వరరావు తెలిపారు.

వల్లీ సిల్క్స్‌లో పట్టు చీరల విభాగం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: కోటగుమ్మం సెంటర్‌లోని వల్లీ సిల్క్స్ షోరూంలో పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా సోమవారం పట్టు చీరల విభాగం ప్రారంభమైంది. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సీజన్‌లో అనేక ఆఫర్లతో కొత్త కలెక్షన్లు అందిస్తున్న వల్లి సిల్క్స్ షోరూంలో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామిజీ చేతుల మీదుగా నూతన పట్టు విభాగం ప్రారంభించామని వల్లి సిల్క్స్ డైరెక్టర్ సుభాష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టు చీరల విభాగంలో పెళ్లిళ్లకు, పండగలకు, అన్ని శుభకార్యాలకు కావాల్సిన పట్టు వెరైటీలు లభిస్తాయన్నారు. లక్షకు పైగా చీరలు, 6,000 పైగా వెరైటీలు, రూ.250 నుంచి రూ. 2 లక్షలకు వరకు వస్త్ర శ్రేణి లభిస్తుందన్నారు. మహిళలు కోరుకునే కంచి పట్టు చీరలు, బనారస్, ఇక్కత్, కలంకారీ, ఆర్గాంజా, లైట్ వెయిట్ పట్టు, గద్వాల్, జార్జెట్, బనారస్, భాంధిని, డిజైనర్ వర్క్ శారీస్, పట్టు ఇక్కత్ పావడాస్ లాంటి ఎన్నో వెరైటీలు లభిస్తాయన్నారు. పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని డైరెక్టర్ సుభాష్ తెలిపారు.

పట్టాలు తప్పిన గూడ్స్



సామర్లకోట – పిఠాపురం బైపాస్ లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్

సామర్లకోట: కాకినాడ నుంచి విశాఖపట్నానికి ఎరువుల లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు సోమవారం పట్టాలు తప్పింది. సామర్లకోట సమీపంలోని ఉండూరు రైల్వే గేటు మీదుగా బైపాస్ లైన్ నుంచి విశాఖ వెళ్లే ప్రధాన లైనులోకి మారుతున్న సమయంలో ఇంజిన్ నుంచి 21వ వ్యాగన్ పట్టాలు తప్పింది. సామర్లకోట – పిఠాపురం రైల్వే లైను కేఎం నంబరు 630/18–22 మధ్య ఈ ప్రమాదం జరిగినట్టు రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 100 మీటర్లు వెళ్లిన తరువాత వాక్యూమ్ బయటకు రావడంతో గూడ్స్ డ్రైవర్ అప్రమత్తమై, రైలును నిలిపివేశారు. ఈ ప్రమాదంతో 100 మీటర్ల మేరకు స్లీపర్లు పాడైపోయాయి. ఏలేరు కాలువ తూము వద్ద రైలు ఒత్తిడికి పట్టా విరిగిపోయింది. విశాఖపట్నం – విజయవాడ మధ్య పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ వెళ్లే యశ్వంత్‌పూర్, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లను పిఠాపురంలో నిలిపివేశారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీకాంత్ ఆధ్వర్యాన ఏడీఎంఎ ఇ.శామ్యూల్ కుమార్, ఏడీఈఎన్ శివప్రసాద్, ఏడీఈఈ సీహెచ్ శ్రీహరివర్మ, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, పబ్లిక్ వే ఇన్‌స్పెక్టర్లు రామసుబ్బారావు, సాయి శంకర్, సామర్లకోట, పిఠాపురం, తుని, కాకినాడ ప్రాంతాలకు చెందిన గ్యాంగ్‌మన్లు అక్కడకు చేరుకున్నారు. రాజమహేంద్రపురం నుంచి ప్రత్యేక క్రేన్‌ను తీసుకు వచ్చి పట్టాలు తప్పిన వ్యాగన్‌ను సరిచేశారు. సామర్లకోట – పిఠాపురం బైపాస్ లైను దెబ్బ తినడంతో ఆ ట్రాక్ మీదుగా రైళ్ల రాకపోకలను నిలిపి వేశారు. కాకినాడ – విశాఖపట్నం మధ్య నడిచే గూడ్స్ రైళ్లను సామర్లకోట స్టేషన్ మీదుగా మళ్లించారు.

కట్నం వేధింపులపై భర్తతో సహా నలుగురిపై కేసు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తతో సహా నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.గంగాభవాని తెలిపారు. ముంగండ గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జునకు 2012లో శ్రీదేవితో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షలు, బంగారు నగలు కట్నంగా ఇచ్చారని, 2017లో వారికి కుమారుడు జన్మించాడని ఆమె వివరించారు.

అప్పటి నుంచి మరో రూ.2 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని శ్రీదేవిని వేధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలో చర్చలు జరిగినా వేధింపులు ఆగలేదన్నారు. అదనపు కట్నం తేలేదని ఈ నెల 19న కుమారుడితో సహా శ్రీదేవిని ఇంటి నుంచి బయటకు గెంటివేశారని తెలిపారు. బాధితురాలు శ్రీదేవి ఫిర్యాదు మేరకు భర్త నాగార్జున, అత్తమామలు సత్యవతి, శ్రీనివాస్, బావ ఉపేంద్రలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ గంగాభవాని వివరించారు.

ఇంటర్మీడియెట్ విద్యార్థిని అదృశ్యం

కాకినాడ క్రైం: నగరంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న ఒక విద్యార్థిని అదృశ్యంపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకినాడ బ్యాంక్‌పేటకు చెందిన హసీనాభాను అనే 17ఏళ్ల విద్యార్థిని స్థానిక సాంబమూర్తినగర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ కళాశాలలో చదువుతూ అక్కడి వసతి గృహంలోనే ఉంటోంది. సోమవారం ఉదయం 5.30 గంటలకు విద్యార్థిని వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్టు ప్రిన్సిపాల్ మధుసూదనరావు కాకినాడ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.